క్లుప్తంగా

ఏఐ, డేటా ఎనలిస్ట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు



రాజేష్ కుమార్‌ను సన్మానిస్తున్న సీఆర్ఆర్ పీజీ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ఎనలిస్ట్ రంగాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉంటాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపల్ ఇంజినీరింగ్ మేనేజర్ నల్లాని చక్రవర్తుల రాజేష్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలను రాజేష్ కుమార్ సందర్శించారు. పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాబోయే జూన్, జూలై నెలలో క్యాంపస్ ప్లేస్మెంట్స్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తొలుత పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి తదితరులు రాజేష్ కుమార్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం రాజేష్ కుమార్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంబీఏ లెక్చరర్స్ తేర రాజేష్, స్ఫూర్తి, ఎన్‌జీఓ మోహిద్దీన్ బాషత తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సంబరాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపం వేదికగా శ్రీశ్రీ కళావేదిక సంస్థ వ్యవస్థాపక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో 10, 11 తేదీల్లో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు కార్యక్రమాలు విజయవంతం కావాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధమాన కవులను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరికోటి, ఉపాధ్యక్షుడు కౌంతియాల కస్తూరి రావు, కో–కన్వీనర్ ఎంజే సుజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- అల్లాడిపోతున్న ప్రజలు
- ఉక్కబోతతో అవస్థలు
- రోడ్లపైకి రావాలంటేనే హడల్



మధ్యాహ్నం 12 గంటలకే నిర్మానుష్యంగా మారిన ఏలూరు పాత బస్టాండ్ సెంటర్



చిన్నారి తలపై టవల్ కప్పి తీసుకెళ్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): భానుడి భగభగలకు పగలు రోడ్ల మీదకు రావాలంటే నగర ప్రజలు హడలిపోతున్నారు. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ఉక్కబోత, వేడి గాలులు అధికమయ్యాయి. దీంతో భగభగ మండే ఎండవేడిమికి తట్టుకోలేక ప్రజలు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఎంతో అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయటకు రాని పరిస్థితి కనిపిస్తోంది. గత నాలుగు రోజులుగా ఏలూరు నగరంలో అత్యధికంగా 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. దీంతో ఉదయం 10 గంటలు నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య సమయంలో రోడ్ల మీదకు ప్రజలు రాలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఒక వేళ వచ్చినా ప్రజలు టోపీలు, నెత్తిమీద టవల్స్, గొడుగులు వంటి ప్రత్యామ్నాయాలు ఉంటే తప్ప రాలేకపోతున్నారు.

వాతావరణ శాఖ హెచ్చరికలతో బెంబేలు

మరోవైపు మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో ప్రజల్లో మరింత ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఇండ్లలోంచి బయటకు రాలేమనిప్రజలు వాపోతున్నారు. ఎండల తీవ్రతకు నిత్యం జన సందోహంతో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, రహదారులు సైతం వెలవెలబోతున్నాయి. నిత్యం రద్దీగా కన్పించే పాత బస్టాండ్ సెంటర్, వసంత మహల్ సెంటర్,జ్యూట్ మిల్లు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్,కొత్త బస్టాండ్ సెంటర్ ఇలా పలు ప్రధాన కూడళ్లల్లో సైతం జన సందోహం అంతంత మాత్రంగానే కన్పిస్తుంది.



జనసంచారం లేని జ్యూట్‌మిల్లు సెంటర్



తంగెళ్లమూడి వెళ్లే మార్గంలో పరిస్థితి ఇదీ

వ్యాపారాలకు సైతం దెబ్బ

భానుడి ప్రతాపానికి భయపడి జనం రోడ్ల మీద రాకపోకలు తగ్గించడంతో వ్యాపారాలకు సైతం దెబ్బ తగిలిందని చిరు వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా ఈసీజన్‌లో మామిడి పండ్లను పెద్ద ఎత్తున ఏలూరు డీసీసీబీ రోడ్డులో విక్రయిస్తూ ఉంటారు. వందల సంఖ్యలో వీధి వ్యాపారులు బండ్ల మీద, సైకిళ్ల మీద పెట్టి మామిడి పండ్లను విక్రయిస్తుంటారు. అయితే ఎండ తీవ్రత ప్రజలు రోడ్ల మీదకు రావడం తగ్గించి వేయడంతో మామిడి పళ్ల కొనుగోళ్లు సైతం సన్నగిల్లినట్లు చెబుతున్నారు. ఆర్ఆర్ పేట, వన్‌టౌన్ మార్కెట్ ప్రాంతాల్లో సైతం వ్యాపారాలు పగటి వేళల్లో అంతంత మాత్రంగానే సాగుతున్నాయని చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి సురక్షితంగా ఉండేందుకు ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో అత్యవసరమైతే తప్ప రోడ్ల మీదకు రావద్దు. వచ్చినా అవసరమైన రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా మంచి నీరు, మజ్జిగ, ద్రవ పదార్థాలు వంటివి తీసుకుంటూ ఉండాలి. నెత్తికి టోపీ పెట్టుకోవాలి. తలకు రుమాలు వంటివి చుట్టుకోవాలి. గొడుగులను వినియోగించడం ఉత్తమం.

– డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్, ఆంధ్ర హాస్పిటల్స్ డైరెక్టర్, ఏలూరు

ఏపీపీఆర్ఎంఈఏ పెదపాడు యూనిట్ ఎన్నికలు ప్రశాంతం



ఏపీపీఆర్ఎంఈఏ పెదపాడు యూనిట్ నూతన కార్యవర్గం

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పెదపాడు యూనిట్ ఎన్నికలు శనివారం ఏలూరు ఏపీపీఆర్ఎంఈఏ జిల్లా శాఖ భవనంలో నిర్వహించినట్లు ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కేహెచ్‌వీఎస్ఎస్ రవి కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే ఆలీ సాహెబ్, కార్యదర్శిగా వి.రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎం.నళిని, ట్రెజరర్‌గా డి.జానకిరాం, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కె.విజయకృష్ణ, బీహెచ్ వాసు ఎన్నికయ్యారన్నారు. ఎన్నికల పరిశీలకులుగా జి.శ్రీధర్‌రాజు వ్యవహరించారు.

శ్రీవారి మహా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



శ్రీవారి ఉత్సవ మూర్తులతో ఆలయ అర్చక స్వాములు, ఆలయ అధికారులు, భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠా మహా కుంభాభిషేకాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ వైదిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీశ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో జీవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వెంకట పవన్ కృష్ణమాచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనూషకు రెడ్‌క్రాస్ జాతీయ అవార్డు

ఏలూరు టౌన్ : ఏలూరు పత్తేబాదలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏఎన్ఎం నర్సింగ్ కాలేజీలో నర్సింగ్ ట్యూటర్‌గా పని చేస్తున్న చిలకలపూడి అనూష ఉత్తమ ఉద్యోగిగా రెడ్‌క్రాస్ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ మాగంటి ప్రసాద్ శనివారం విలేకరులకు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ న్యూఢిల్లీ 2023–24 సంవత్సరానికి గానూ అవార్డులు అందించే క్రమంలో ఉత్తమ ఉద్యోగిగా ఈనెల 13న రాష్ట్రపతి భవన్‌లో గౌరవ చైర్మన్ జేపీ నడ్డా చేతుల మీదుగా ప్రశంసా ప్రతాన్ని తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో శనివారం అనూషకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నర్సింగ్ ట్యూటర్‌గా రెడ్‌క్రాస్ సంస్థలో 14 ఏళ్లుగా పని చేస్తుందనీ, ఎంతోమంది నర్సింగ్ విద్యార్థినిలకు ఉత్తమ శిక్షణ అందించారని అభినందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు అలపాటి నాగేశ్వర రావు జాతీయ అవార్డు గ్రహీత అనూషకు ప్రయాణ ఖర్చులకు గానూ రూ.10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు డాక్టర్ వర ప్రసాదరావు, ఎంవీవీ నాగేశ్వరరావు, మేతర అజయ్‌బాబు, సీఆర్ఆర్ ఫార్మసీ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ కుమారస్వామి తదితరులు ఉన్నారు.



రెడ్‌క్రాస్ నర్సింగ్ ట్యూటర్ అనూషను అభినందిస్తున్న దృశ్యం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐకమత్యంతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లెం ప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు ఐక్యమత్యంతో రాజ్యాధికారం సాధించాలని ఫారెస్టు బోర్డు మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఏలూరు కొత్త రోడ్డులోని నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో శనివారం దళిత బహుజన నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెం ప్రసాద్, నవసమాజ్ సొసైటీ చైర్మన్ నేతల రమేష్ బాబు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మహాత్మా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానంతో రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో దాసరి నాగేంద్ర కుమార్, ప్రముఖ న్యాయవాది చిక్కా భీమేశ్వర రావు, పోలిమెట్ల దేవకాంతారావు, మేడిశెట్టి గిరిబాబు కొత్తల పూర్ణ మల్లికార్జున్, దాసి వెంకటేశ్వర్లు, కండవల్లి స్వామి దాసు, కర్రా వేణుగోపాల రావు,కంచర్ల విజయ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే సృజనాత్మకతపై దృష్టి పెట్టాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చిన్ననాటి నుంచే సృజనాత్మకతపై దృష్టి సారించాలని సీనియర్ రిసోర్స్‌పర్సన్ డీ. శ్రీవల్లి సూచించారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా ఆమె విద్యార్థులకు యోగా, పేపర్ క్రాఫ్ట్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేపర్ క్రాఫ్ట్‌తో అనేక ఆకృతులు తయారు చేయవచ్చని, వాటిని గృహాల అలంకరణకు వినియోగించుకోవచ్చన్నారు. అలాగే యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. అనంతరం బీవీఎస్ లక్ష్మి విద్యార్థులతో కథలు చెప్పించడం, చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా నీతి కథలు చదివించారు. డ్రాయింగ్ టీచర్ పి. శంకర విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు, ఎండీ అస్లాం తదితరులు పాల్గొన్నారు.



తాము తయారు చేసిన పేపర్ క్రాఫ్ట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సంగీతం, నృత్యం తెలుగు వారి ఆస్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంగీతం, నృత్యం తెలుగు ప్రజల ఆస్తులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవాలు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కళా దీపిక నృత్య అకాడమీ నిర్వాహకురాలు నాట్యాచారిణి ఎ.పార్వతీ రామచంద్రన్, కళారత్న కేవీ సత్యనారాయణ ఏలూరు నగరానికి కూచిపూడి నృత్యంతో ప్రపంచ ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. వారు నృత్య సంగీత రంగాల్లో చేసిన విశేష కృషిని అభినందించారు. తొలుత త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా కళావేదికపై స్థానిక సంగీత కళాకారులు ఆలపించిన త్యాగరాజ పంచరత్న సేవ సంగీత మహోత్సవంలో ఆలపించిన గీతాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం అకాడమీ విద్యార్థులు త్యాగరాజ స్వామి కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కూచిపూడి నాట్యరత్న పసుమర్తి శ్రీనివాస శర్మను సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళారత్న కేవీ సత్యనారాయణ, వేణుగోపాల్ లునాని, దువ్వి హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నాట్యరత్న పసుమర్తి శ్రీనివాస శర్మను సన్మానిస్తున్న అతిథులు

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం ఏలూరు అన్నే వెంకటేశ్వరరావు భవనంలో శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మే 20న ఒక రోజు దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు నిలిపేసి మండల కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.రవి, తామా ముత్యాలమ్మ, జి.వెంకట్రావు, జిల్లా సహాయ కార్యదర్శి కారం నాగ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	38	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	30-36	బీట్‌రూట్	34
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	22	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	21.15	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	02
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	04
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	03
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	03
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - బీహెచ్ఈఎల్ (ఖమ్మం)	20.00	98516	15
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.10	98503	09
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ

పెదవేగి : నేటి సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం పెదవేగి మండలం వంగూరు గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలపైన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. పిల్లలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలని, అప్పుడే వారు అభివృద్ధిలో పయనిస్తారని అన్నారు. కార్మికులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబరు 15100 కు ఫోను చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. న్యాయ వాది పి.రత్నరాజు, ప్యానల్ న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, జీవీ భాస్కర్, గ్రామ సర్పంచి రూత్ మేరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

వైభవంగా పద్దాల వెంకమ్మ సంబరాలు

భీమడోలు: అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల గ్రామ శ్రీ పద్దాల వెంకమ్మ సంబరాలు వైభవంగా సాగుతున్నాయి. మూడు రోజులు పాటు జరిగే ఈ సంబరాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం మహిళలు, ఆడపడుచులు అమ్మవార్లకు జలాభిషేక పూజలు చేశారు. సాయంత్రం గరగ నృత్యాలు, మేళ తాళాలతో గణాచారులు గ్రామ సంచారం నిర్వహించారు. ఇంటికి వచ్చిన గణాచారులకు గ్రామస్తులు పసుపు నీళ్ల వారబోసి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆలయా ల్లోని అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. నిర్వాహకులు రామిశెట్టి బుజ్జి గోపాల్, రామిశెట్టి రమణయ్య, రత్నాలరావు మాట్లాడుతూ రామిశెట్టి వారి ఆడపడుచు పద్దాల వెంకమ్మ అమ్మవార్లకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి జాతర సంబరం చేస్తామన్నారు. ఆదివారం అమ్మవార్లకు నైవైద్యాలు సమర్పించడం జరుగుతుందన్నారు.



వడ్లపట్లలో మేళ తాళాల నడుమ ఊరేగుతున్న గణాచారులు

ప్రధాని మోదీ మాటలు చంద్రబాబుకు వర్తించవు

నిడమర్రు: ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ వికసిత్ భారత్‌కు ఆ నాలుగు వర్గాలే మూల స్తంభాలు లాంటి వారని అన్న మాటలు చంద్రబాబుకు వర్తించవని వైఎస్సార్‌సీపీ స్టేట్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకట రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజన్‌గా ఎదగాలంటే పేదలు, యువత, మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలని, ఆనాలుగ వర్గాలకు పెద్దపీట వేయాలని మోదీ తెలిపారని వివరించారు. తన పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాల ఉన్నతికి కృషి చేశారని వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ



నౌడు వెంకట రమణ

చంద్రబాబు పాలనలో ఈ వర్గాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రధాని మోదీ ఇచ్చిన భరోసాపై ప్రజలు కొంత వరకు నమ్మచ్చేమో కానీ, బాబు మాటలు ఎవ్వరూ నమ్మరని నౌడు ఎద్దేవా చేశారు. మోదీ ప్రకటించిన పనుల్లో జాతీయ రహదారుల నెట్‌వర్క్ సిస్టమ్, రైల్వే పనులు వంటి వాటిల్లో ఎక్కువ పనులు గతంలో వైఎస్ జగన్ పాలనలో కేంద్రం నిర్ణయించినవే అని, అయితే అవి ఇప్పటి ప్రభుత్వంలో కేంద్రం అమలు చేస్తుందని స్పష్టం చేశారు.